క్లుప్తంగా

'పుస్తక ప్రదర్శన'



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఆదివారం చేపట్టారు. లైబ్రేరియన్ బి.గణేష్‌బాబు మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శన చేపట్టామని, ప్రతిఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన తదితర పోటీలకు ఎలా సిద్ధం కావాలో విద్యార్థులకు ఉపాధ్యాయుడు కె.షణ్ముఖరావు తెలిపారు.

భామినిలో ఛత్తీస్‌గఢ్ రైతులు



సన్నాయికాలనీ రైతులతో మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ రైతులు

భామిని: మండలంలోని బొడ్డగూడ, సన్నాయి కాలనీ, మూలగూడ, ఏతంగూడ గ్రామాల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పుర్బ జిల్లాకు చెందిన దాదాపు 50 మంది గిరిజన రైతులు ఆదివారం పర్యటించి, ప్రకృతి వ్యవసాయంలో భాగంగా అక్కడి గిరిజన రైతులు అనుసరిస్తున్న సేంద్రియ సాగు విధానాలపై అధ్యయనం చేశారు. సులభమైన పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే పంటలు, వాటి సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ డీఈఎం కల్యాణ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు



పెద్దూరులో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, శివ్వాం, రావుపల్లి తదితర గ్రామాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు ఏ క్షణాన ఎవరిపై దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. గతంలో విచ్చలవిడిగా తిరుగుతూ చిన్నపిల్లలు, వృద్ధులు, పశువులు, గొర్రెలు, కోళ్లపై అవి దాడులకు పాల్పడిన ఘటనలు గుర్తుకు తెచ్చుకుని, తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి, వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉచితంగా రోగులకు వైద్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన అంటిపేటలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) పథకం ద్వారా స్పెషలిస్టులైన డాక్టర్లతో వైద్యపరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోగులకు అవసరమైన వైద్యసేవలు ఉచితంగా అందించడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఉచితవైద్య శిబిరం తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణంనాయుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందరికీ ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా డాక్టర్లతో పాటు వ్యాధి నిర్ధారణకు అవసరమైన పనిముట్లు, వ్యాధుల నివారణకు మందులు సమకూర్చి ఇళ్లవద్దనే ఉచితంగా వైద్య సేవలందిస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వానికి మనమంతా అండగా ఉండాల్సిన సమయం ఆసన్న మైంద న్నారు. అంటిపేటలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రంవరకూ నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాన్ని ప్రజలంతా వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, వైద్యారోగ్యశాఖ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యం



వీరఘట్టం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు



పాలకొండ రూరల్: వెలగవాడలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్యప్రకాష్, అధికారులు



సీతంపేట: టిటుకుపాయిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ, ఏపీవో రోషి రెడ్డి, ఎంపీడీవో సత్యం తదితరులు



పాలకొండ: కొండాపురంలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న గ్రామస్తులు



పాలకొండ రూరల్: ఎం.సింగుపురంలో చీపుళ్లతో వీధులు శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు

గార్బేజ్ ఫ్రీ ఇండియా(చెత్త రహిత భారతదేశం) లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, సముద్ర, నదీతీర ప్రాంతాల్లోని చెత్తాచెదారం ఏరివేసి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేపట్టి, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి, స్వచ్ఛ భారత్‌కు సహకరించాలని కోరారు. -సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: ఎస్.కె పాడులో చెరువు వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం





జియ్యమ్మవలస: రావాడ రామభద్రాపురం ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) భామిని: కాట్రగడ-బిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సింహాచలం

పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలోని తెలగ వీధిలో నిర్వహించిన వైఎస్సార్ కాపునేస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాసేపు మాట్లాడారు. 2019 ఎన్నికల్లో పాలకొండ నియోజకవర్గంలో వచ్చిన ఫలితాలే 2024 ఎన్నికల్లోనూ పునరావృతం కావాలన్నారు. ఆ దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2019లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి 18,353 ఓట్ల మెజార్టీ వచ్చిందని, ఈసారి జరిగే ఎన్నికల్లో అంతకుమించి మెజార్టీ రావాలన్నారు. పాలకొండ నియోజకవర్గ గెలుపుతోనే సీఎం జగనన్న వై నాట్ 175 లక్ష్య సాధనను నెరవేరుద్దామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నో కేసుల్లో స్టేలు తెచ్చుకుని, తనను తాను కాపాడుకున్నారని, చివరికి స్కిల్ స్కాంలో చిక్కుకుని, జైలుపాలయ్యారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అవినీతి చేసిన వారు ఎప్పటికైనా పట్టుబడతారనే దానికి చంద్రబాబే ఓ ఉదాహరణన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ నేతలు చేపడుతున్న కార్యక్రమాలు చూసి, ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఇటీవల ఆ పార్టీ నేతలు ప్లేట్లు కొడుతూ, విజిల్స్ వేస్తూ, డప్పులు కొడుతూ, వాహనాల హారన్లు మోగిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేసిన కార్యక్రమాలు చూసి, వీరేంటిలా అని జనం అనుకుంటున్నారన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మీకు మంచి జరిగితేనే తనకు ఓటు వేయమని సీఎం జగనన్న అడుగుతున్నారంటే అలా ఓట్లు అడిగే దమ్మూధైర్యం ఒక్క జగనన్నకే ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ కాపునేస్తం లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ జై జగన్.. జై వైఎస్సార్ సీపీ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, సర్పంచ్ గౌరమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ప్రేమభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో గరుగుబిల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు, విశ్రాంత వీఆర్‌వోల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పలనాయుడు మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు ఆదివారం ఆ గ్రామం వెళ్లి, మృతుని భార్య తవుడమ్మ, కుమారుడు వెంకటదామోదర్‌ను కలిసి, పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు. గొట్టివలస గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బోను కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు.

అలరించిన నాటక ప్రదర్శనలు



నాటకంలో ఓ సన్నివేశం

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న సత్యకైలాష్ పాఠశాలలో మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నాటక పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చీకటి పువ్వు, కెరటాలు, మలిసంధ్య నాటకాలు అలరించాయి. రోజుకు మూడు నాటకాలు చొప్పున వేయిస్తున్నామని పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు ఎం.భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నాటకరంగం కనుమరుగైపోతుందన్న సమయంలో మేరంగి నాటక పరిషత్ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాటకాలు, నాటికల ద్వారా తక్కువ సమయంలో ఆనందం, సందేశం ప్రజలకు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు పారినాయుడు, కవులు తుంబలి శివాజీ, సిరికి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంచన్‌గా పింఛన్ల పంపిణీ



పాలకొండ రూరల్: వాండ్రంకి వీధిలో వృద్ధురాలికి పింఛన్ ఇచ్చేందుకు బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్



గుమ్మలక్ష్మీపురం: భామిని మండలంలోని గురండి గ్రామం వెళ్లి, లబ్ధిదారుకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ దేవి

వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద అర్హులైన వారందరికీ ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. వేకువజామున 5:30 గంటల నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు నేరుగా వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. గతంలో టీడీపీ హయాంలో లాగా కాకుండా ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే రంచన్‌గా పింఛన్లు అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. -సాక్షి నెట్‌వర్క్.

ఎన్ఆర్‌సీ తనిఖీ

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో గల పోషకాహార పునరావాస కేంద్రా(ఎన్ఆర్‌సీ)న్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వచ్చి ఇక్కడ అడ్మిట్ అయిన ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య వివరాల నమోదు రికార్డులు ఈ సందర్భంగా పరిశీలించారు. పది పడకల ఎన్ఆర్‌సీలో ప్రతి నెలా జరుగుతున్న అడ్మిషన్లు, డిశ్చార్జ్‌ల వివరాల్లో చేరేటప్పుడు వారి బరువు, ఆరోగ్యస్థితి అదేవిధంగా డిశ్చార్జ్ అయ్యేనాటికి వారి బరువు ఆరోగ్య స్థితి ఏ మేరకు మెరుగైనదీ తెలుసుకున్నారు. వారికిస్తున్న పోషకాహార మెనూను పరిశీలించారు. ప్రతి బెడ్ వద్ద ఉన్న చిన్నారి ఆరోగ్యాన్ని పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడ పిల్లల బరువును స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన ఐదేళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం, బరువుతక్కువ, ఎదుగుదల లోపం గల పిల్లలను అంగన్వాడీ సిబ్బంది, వైద్యసిబ్బంది గుర్తించి, ఎన్ఆర్‌సీలో కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. ఎన్ఆర్‌సీలో న్యూట్రిషన్ కౌన్సిలర్, వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, పిల్లల ఆరోగ్యం మెరుగుపడే వరకు (రెండు వారాల వరకు) ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్యసిబ్బంది ఆశాజ్యోతి, దివ్యతేజ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు

పాలకొండ రూరల్: బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని, అలా అయితేనే ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బస్సు టైర్ల సంరక్షణ పక్షోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు తీసేముందు బస్సు ఏ స్థితిలో ఉందో తెలుసుకోవాలన్నారు. బ్రేకులు, టైర్లు బాగున్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. రోజులో రెండు సార్లు టైర్లలో గాలి నింపించాలన్నారు. ప్రతిరోజూ టైర్ల మధ్య ఇరుక్కున్న రాళ్లను తొలగించాలన్నారు. వీలైనంత వరకు సడన్ బ్రేకులు వేయకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. అనంతరం టైర్ల మైలేజీని పెంచే ప్రతిజ్ఞ డ్రైవర్లతో చేయించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

గుమ్మలక్ష్మీపురం: విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టనున్న సైకిల్ యాత్ర కార్యక్రమానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఎస్.ఎఫ్.ఐ, గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడు ఎ.గంగారావు మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హానర్స్, మైనర్స్ సబ్జెక్టుల విధానం రద్దు చేయాలన్న తదితర డిమాండ్లతో పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలు కలుపుకుని, 400 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేయనున్నామన్నారు. ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు సైకిల్ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు బి.అనీల్, ఎలియజర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మొబైల్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

సీతానగరం: మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడానికి ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ను ప్రతి ఒక్క మహిళ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని దిశ మహిళా ఎస్సై సంతోషి పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట మహిళా కేజీబీవీ విద్యాలయంలో దిశయాప్ వినియోగం, మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయడంపై విద్యార్థినులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.నీలకంఠం పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన



దిశ యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

భామిని: స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో దిశ యాప్ వినియోగం, దాని ఉపయోగాలపై ఆదివారం అవగాహన కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా దిశ ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ఎప్పుడు ఏ రకమైన ఆపద వచ్చినా రక్షణ కోసం దిశ యాప్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. యాప్‌ను ఆశ్రయించిన కొన్ని క్షణాల్లోనే పోలీసులు వచ్చి, రక్షణ కల్పిస్తారన్నారు. ఎక్కడైనా ఎవరైనా ఎవరి చేతనైనా ఇబ్బంది పడినా, బాల్యవివాహాలు జరిగినా, బాలకార్మికులున్నా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరి స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం దాని వినియోగం వివరించారు. కార్యక్రమంలో బత్తిలి ఏఎస్ఐ గురుమూర్తి, ఎస్ఓ బి.శారద, మహిళా పోలీస్ చందన పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



పాలకొండ రూరల్: సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు



కురుపాం: సన్మానం పొందిన వృద్ధులతో రెవెన్యూ సిబ్బంది

కురుపాం

మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 80 ఏళ్ల వయసు దాటిన వృద్ధులను తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్దల అనుభవాలు భవిష్యత్‌లో మనకు ఏ విధంగా ఉపయోగపడతాయో సవివరంగా తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 80 ఏళ్ల వయసు నిండిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అనంతరం పెద్దల గొప్పతనం, వారి అనుభవాలతో భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలు ఎలా అధిగమించుకోవచ్చన విషయం వక్తలు వివరించారు. పెద్దలను గౌరవించడం మన బాధ్యత అని, వారు అనుభవంతో చెప్పే అభిప్రాయాలకు మనం ఎప్పుడూ కట్టుబడి ఉండాలని ఏపీవో రోసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ డి.శేఖర్, వీఆర్వో బలివాడ సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.